# లాటరి

రచన:
**కమల కుమారి**

ఆఫీసు పనిమీద కర్నూలు వెళ్ళిన మధుమూర్తికి స్టేషనులో అనుకోకుండా చిన్ననాటి స్నేహితుడు మురళి కనిపించేడు,

'హల్లో మూర్తి, ఎక్కడిదాకా ప్రయాణం'

'ఇక్కడి దాకేనురా. ఆఫీసు పనిమీద వచ్చేను.'

'అయితే ఇంకేం. మా ఇంటికిరా. మా శ్రీమతిని పరిచయంచేస్తా. ఉన్న రెండు రోజులు మా యింట్లోనే వుండువుగాని' అంటూ మురళిని మూర్తి లాకెళ్ళేడు.

మురళి భార్య లావణ్య. పేరుకి తగ్గట్టాగానే ఉండేది. ఉన్న రెండు రోజుల్లోనే మురళికి వాళ్ళింట్లో బాగా అలవాటయి పోయింది.

ఇంక మూర్తి రేపెళ్తాడనగా తొలిరోజు సాయంత్రము ఇరువురూ బజారుకి వెళ్ళేరు.

ఏవో సామాన్లు కొనివస్తుంటే, బాగా చిరిగిన దుస్తులు, ధరించి, పీచులాగ ఉన్నజుత్తుని వెనుకకు తోసుకుంటూ, చేతిలో ఒక కాగితంతో, అందరిని తోసుకుంటూ మురళి దగ్గరగా ఒచ్చేడు, ఒక ముసలితాత.

'మురళి బాబూ! చూడు ఈ రోజు పేపరులో లాటరీ ఫలితాలు పడ్డాయట. నా నెంబరు ఉందేమో చూడు' అన్నాడు.

'లేదు. మాష్టారు లేదు. ఈసారి తప్పకుండా వస్తుందేమో.'

'అలాగా నాయనా! పోనిలే మరో టిక్కెట్టు కొనవచ్చునంటూ మరేదో సణుగుతూ ముందుకి సాగిపోయేడు.

'ఎవరు మురళి ఆ తాత? మూర్తి ప్రశ్న.

'ఒక అభాగ్యుడు.' అంతే మురళి గంభీరంగా మారిపోయేడు.

---

**దేశంలో చాలాచోట్ల చేతివృత్తి పనివారు రమణీయమైన వస్తుసామగ్రిని స్వహస్తాలతో తయారుచేస్తున్నారు. ఈ వస్తువులలో లోహ సామగ్రి, ఆటవస్తువులు, పాలరాతి చెక్కడపు వస్తువులు, లక్కపని వస్తువులు, మృణ్మయ పాత్రలు, చాపలు, తివాచీలు, తోలువస్తువులు మొదలైనవి వున్నాయి. ఇవి మన ముఖ్యమైన చేతివృత్తులలో కొన్ని.**

---

నిశ్శబ్దంగా నడుస్తున్న మురళిని మాట్లాడించలేక పోయేడు మధు.

* * * *

మౌనంగా తిరిగివచ్చి భోజనాల దగ్గర కూడ మౌనంగా వాళ్ళను చూసిన లావణ్య.

'ఏమండీ! మాష్టారు కనిపించేరా' అంది.

'ఊఁ' అని చెయ్యి కడిగేసుకున్నాడు.

ఇదంతా చూస్తున్న మధుకి ఆశ్చర్యమేసింది. బజారులో కనిపించిన ఆ తాతకి, వీళ్ళకి ఏమిటి సంబంధం మురళి మౌనం చూసి మాష్టారు కనిపించేరా అని లావణ్య అడిగింది, ఆమె కెలా అర్థమైంది? మొదలయిన ప్రశ్నలతో బుఱ్ఱ వేడెక్కిపోయింది.

ఇక ఉండబట్టలేక 'లావణ్యా మీ కెలా తెలిసింది మాష్టారు వాడికి కనిపించేరని.'

'అదా అది నాకు మామూలే! ఆ మాష్టారికథ ఆయనే చెప్పాలి. చెప్పకేం? కొత్తలో నాకు చాలా భయమేసింది. తర్వాత ఆయనే చెప్పేరు.' అంది లావణ్య.

'ఆహా! అలాగా' అంటూ పెరట్లోకి దారితీసేడు మధు.

♦ ♦ ♦ ♦

పెరట్లో ఘుమ ఘుమలాడే పరిమళంతో, నీ వెన్నెల తెల్లదనం నాతో పోటీవస్తుందా? అని అడుగుతున్నట్లుగా విరచూసిన జాజి పందిరిక్రింద మంచం వేసుకొని దాని మీద సిగరెట్టు కాలుస్తూ మురళి పడుకున్నాడు.

మధు దగ్గరగా ఆ మంచం మీదనే కూర్చున్నాడు.

'మురళీ! ఆ తాత కథ నాకు చెప్పవూ? అన్నాడు.

'తప్పకుండా' ఆ మేష్టారి కథ చాలా విచిత్రంగా, చెబుతా విను.

తూహలంగా మరి కాస్త దగ్గరగా జరిగేడు మధు.

* * * *

'నీకు ట్రాన్స్‌ఫర్ అయ్యాక నాకు ఏమీ తోచేది కాదు. మనిద్దరం కలిసి తిరిగిన స్థలాలు చూస్తే నాకు చాలా బాధగా వుండేది. నీ తరువాత నీలాంటి మంచి స్నేహితుడు ఒక్కడూ దొరకలేదు నాకు.

కాని అనుకోకుండా 'ఈ మేష్టారితో మనరామం ద్వారా పరిచయం జరిగింది.'

'మన వూరిలోనే చిన్న ఎలిమెంటరీ స్కూలులో

4.5 తరగతులకు పాఠాలు చెబుతూ ఆ వచ్చిన జీవితం తోనే కాలక్షేపం చేసేవారు.

'మా యింటికి నాల్గుగిళ్ళ తరువాత వారి ఇల్లు ఆ ఒక్కనాటి స్నేహంతోనే ప్రతిరోజూ వాళ్లింటికి వెళ్ళే వాడిని. ఒక్కరోజు వెళ్ళకపోతే మనసు చాలా బాధ పడేది. నీతో అలా సినిమాలకి తిరిగే నేను, మాస్టారి పరిచయం తరువాత బజారుకి వెళ్ళేవాడిని కాను.'

'వింటున్నావా? బోరుకొట్టున్నా నేమిటి?' మురళి మధ్య ఆపి అడిగేడు.

'అబ్బే! లేదు. వింటున్నానులే చెప్పు' అన్నాడు మధు.

మురళి మళ్లీ చెప్ప ప్రారంభించేడు.

నేను వెళ్ళినప్పుడలా అన్నపూర్ణమ్మగారు కాఫీ తెచ్చి ఇచ్చేవారు. క్రొత్తలో మొహమాటం వేసినా రాను రాను అది అలవాటయి పోయింది. అన్నపూర్ణమ్మగారిది అమృత హస్తమే. ఆమె చేతి కాఫీ అమృతంలాగ ఉండేది. నాళ్ళమ్మాయి ఆరేళ్ళ లత నేను వెళ్ళగానే అన్నయ్యా, అన్నయ్యా అంటూ మీద పడేది.

'తర్వాత మా అక్కయ్య కూతురు పెళ్ళికి విజయవాడ ముందుగా వెళ్ళాల్సి వచ్చింది.'

'పెళ్ళి ఘనంగా జరిగింది. ఆ పెళ్లి అయిన వెంటనే నేను తిరిగి మావూరు వచ్చేశాను. రాగానే మొదటగా మాస్టారింటికి వెల్లి చూసేను.'

'కాని నేను వెళ్లేసరికి కళకళ లాడే ఇల్లు బావురు మంటోంది, ఒక మూలగా లత సొమ్మసిల్లినట్లు పడి నిద్దర పోతోంది. బుగ్గలమీద కన్నీటి చారికలు. నాకు ఆశ్చర్యం వేసింది. నేనేనాడూ ఆపిల్ల ఏడ్వగా చూడలేదు.. లేక లేక కలిగిన పిల్లని అతి గారాబంగా చూసేవారు.

'నెమ్మదిగా గదిలోపలికి వెళ్లేను. మాస్టారు కుర్చీలో పడుకున్నారు. మేష్టారూ! అని పిలిచేను.

నెమ్మదిగా కళ్లు తెరచి చూసేరు. ఎవరూ? అంటూ నన్ను చూసి చిన్నగా నిట్టూర్చి 'రా నాయనా! కూర్చో అంటూ ప్రక్కనే వున్న బల్ల ముందుకి త్రోసేరు.

ఆ బల్లమీద కూర్చోని 'మేష్టారూ అమ్మేది?' అన్నా నెమ్మదిగా.

'ఇంకెక్కడి అమ్మ బాబూ! వెళ్ళిపోయింది, మనల్ని వదలి వెళ్ళిపోయింది.' కన్నీళ్ళు చెంపలమీదుగా జారి ఎండిన గుండెలమీద పడుతున్నాయి.

'మేష్టారూ......అదిరి పడ్డాను.' ఏంటి మాష్టారు మీరు చెప్పేది. నిజమేనా? ఏం జరిగింది నాతో చెప్పండి మాష్టారూ అన్నాను.

'ఏం లేదు నాయనా రెండురోజులు వచ్చిన జ్వరం తోనే పరలోకం చేరుకుంది. అదృష్టవంతురాలు. నాకు మాత్రం లతను విడిచి పెట్టింది' అంటూ బావురు మన్నారు.

లత పేరు వినగానే గుమ్మంలో ఉన్నలత గుర్తుకి వచ్చింది.

అమ్మా! లతా అంటూ పరుగున వెళ్లి ఆ పిల్లను ఒడి లోనికి తీసికొన్నాను.

త్రుళ్ళిపడిలేచిన లత, నన్నుచూచి గట్టిగా పట్టేసు కొని 'అన్నయ్యా అమ్మదేవుడి దగ్గరికి వెళ్ళిందట, ఒక్కసారి రమ్మనవూ' అంటూ రాగాలు మొదలెట్టింది.

'ఒస్తుందమ్మా, నే చెబుతాగా రమ్మనమని' అంటూ కంటనీరు తుడిచేను.

'అన్నపూర్ణ పోతూ పోతూ మురళిని ఒక్కసారి చూడలేక పోయేను అంటూనే కనుమూసింది నాయనా. దానికి నీమీద పంచప్రాణాలు' అంటూ లతను ఒడి లోనికి తీసికొన్నారు.

నా కళ్ల వెంట సంతతి ధారాపాతముగా నీళ్ళు కారసాగేయి.

ఆ పరిస్థితిలో మేష్టారిని వదలి వెళ్ళడానికి మనస్కరించలేదు. మేష్టారిని ఇంటికి తీసికెళదామని నిశ్చయించుకున్నాను.

మేష్టారు మా యింటికి లతని తీసికొనిరండి నాలుగు రోజులు వుండి వద్దురుగాని' అన్నాను.

'మేష్టారు అడ్డు చెప్పలేదు. 'ఔను నాయనా, ఈ ఇంట్లో ఉండటం కష్టమే. మీ యింటికే పద' అన్నారు మేష్టారు.

అతన్ని తీసికొని బయలుదేరేను.

మా అమ్మ మేష్టారిని చూడగానే ఆదరంగా లోనికి తీసికెళ్ళింది.

అలా ఒకవారం రోజులు మా ఇంట్లో వున్నారు.

'మేష్టారూ! కొద్దిగా గుండెదిట పరచు కొండి. లతకోసమైనా మీరు ధైర్యంగా వుండాలి. అని నేను నచ్చ చెప్పేక, మళ్లీ స్కూలుకు కెళ్ళడం సాగించేరు.

(తరువాయి 23వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

చెపుతూ చెపుతూ ఆగేడు మురళి అంతవరకు శ్రద్ధగా వింటున్న మధు కంటి నీరు తుడుచుకొని.

'మరి మేష్టారు అలా ఎందుకయ్యారు' అన్నాడు.

చెపుతా అంటూ 'లావణ్యా గ్లాసుడు మంచినీళ్లు తే' అంటూ మళ్లీ ప్రారంభించ బోయేడు.

ఇంతలో లావణ్యగ్లాసుతో నీళ్లు తెచ్చింది. ఆ నీళ్ళు త్రాగి, గ్లాసు నందిస్తూ

'ఆ! అలా మేష్టారు మళ్ళీ స్కూలుకి వెళ్ళిరావడం ప్రారంభించేరా?'

కాని... కాని ఇంతలో గోరుచుట్టుమీద రోకటి పోటులాగ స్కూలు మేష్టార్ల జీతం సరిగ్గా ఇవ్వడం మానేశారు.

ఆ జీవితం మీదనే ఆధారపడిన మాష్టారు విలవిల లాడేరు. కాని నాకు మాత్రం, మాట మాత్రం కూడ చెప్ప లేదు.

అలా రెండు నెలలు గడిచేయి.

ఒకరోజు మాష్టారి ఇంటికి వెళ్ళేసరికి లత ఒకటే ఏడుస్తూంది.

మేష్టారు విసుక్కుంటున్నారు.

నేను గబాలున లతని ఎత్తుకొని 'ఏమ్మా! నీకేం కావాలి?' అన్నాను,

'నాకు... నాకు ప్రక్కనున్న వాళ్ళరాదకి ఉన్న లాంటి పట్టులంగా కావాలి.' అంది మధ్య మధ్య వెక్కుతూ.

'లంగా కావాలిట లంగా' మనకెలా వస్తాయి. తిన టానికి అన్నమే సరిగ్గా లేదే రెణ్ణెల్లయి' అన్నారు మేష్టారు రొప్పుతూ.

'ఏమిటి మాష్టారూ మీరనేది? రెండు నెలలంటూ భోజనం లేదూ? మరి రోజూవచ్చే నా కెందుకు చెప్ప లేదు. ఈ ఇంటిమీద అప్పుతెచ్చి వాడుతున్నాను. అన్నారు.

'ఎంతపని చేసేరు మాష్టారూ. నాకు ఒక్కమాట చెపితే ఏం?' అని లతని ఇంటికి తీసికొని వచ్చేశాను.

* * * *

'మధ్యలో ఏదో పనిమీద హైద్రాబాదు వెళ్ళేను. అంటూ చిన్నగా లావణ్యను చూసి నవ్వేడు మురళి.'

లావణ్య తలదించుకుంది.

నాకు అర్థమైపోయింది ఏమిటో హైద్రాబాదులో పని.

అక్కడి నుంచి వచ్చేక యధాప్రకారం మేష్టారిదగ్గరకు వెళ్ళేను.

మేష్టారు వాలు కుర్చీలో కూర్చుని లతతో ఏదో నవ్వుతూ చెప్తున్నారు.

'ఏం సంగతి మేష్టారూ? చాలా హుషారుగా వున్నారు' అంటే-

'అబ్బె ఈ రోజు ఒక లాటరీ టిక్కట్టు కొన్నా నోయి. ఫస్టుప్రైజ్ వస్తే ఏం కావాలో మా లతిని అడుగు తున్నాను అన్నారు' నవ్వుతూ.

హమ్మయ్య మేష్టారు నవ్వుతున్నారు. ఫర్వాలేదు. అనుకున్నాను.

కాని ఆ నవ్వు ఆ చిరకాలములోనే మాడిపోతుందని అనుకో లేదు.

* * * *

ఆ రోజు నాకు బాగా గుర్తు.

లత పుట్టినరోజని చక్కటిరైలు బండినికొని తీసికొని వెళ్లేను.

లత తన ఫ్రెండ్సుతో కలిసి మాష్టారి ఇంటికి కాస్త దూరంలో ఉన్న మైదానంలో ఆడుతున్నది.

మేష్టారు కుర్చీలో పేపరు చదువుతున్నారు. నన్ను చూసి' ఆలస్యం చేసే వేమోయిరా! కూర్చో' అంటూ పలకరించేరు. తిరిగి పేపరుచూస్తున్న మేష్టారిదృష్టి లాటరీ ఫలితములపై పడింది.

గబగబా జేబులోని టిక్కట్టు తీసినంబరు చూసేరు.

చూస్తూ చూస్తూ మేష్టారు 'మురళీ నాకు కాదు, కాదు- మా లతకి ఫస్టుప్రైజ్ వచ్చిందోయి' అంటూ గుమ్మంలోనికి పరుగెట్టి-

అమ్మా లతా నీపేరున కొన్న లాటరీలో నీకు ఫస్టు ప్రైజు వచ్చిందమ్మా త్వరగారా. అన్నయ్య కూడ వచ్చేడు అంటూ కేకేశారు.

ఆనందంతో పరుగు పరుగున వస్తున్నలత రోడ్డుదాట బోయి, రయ్యిమని దూసుకు వస్తున్న లారీక్రింద పడింది.

అంతే మాష్టారు 'లతా' అని ఒక్క గావు కేక పెట్టేరు. రోడ్డుమీద జనం అంతా చేరేరు. డాక్టర్ని పిలవండి అని ఎవ్వరో అన్నారు.

కాని ఆ అవసరం లేకపోయింది. లత శాశ్వతంగా వెళ్ళిపోయింది.

దాని తర్వాత మాష్టారు ఆ లాటరీ టిక్కట్టును చింపి పారేశారు. ఇక అప్పటినుండి మాష్టారి పరిస్థితి నిన్న నువ్వు చూచేవుగా అంతే.

ప్రాణపదంగా ప్రేమించిన లత దుర్మరణం తర్వాత మేష్టారు పూర్తిగా పాడై పోయేరు.

లాటరీలో గెలిచిన మాష్టారు విధివేసిన లాటరీలో ఘోరంగా ఓడిపోయేరు.